సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శనివారం 18-1-2025

సంపుటి: 20 సంచిక: 251

పేజీలు: 4 వెల: రూ.1



# కమిషనర్ గారూ.. సెలవు తీసుకోండి!



- చెప్పకుండా వెళ్లడంపై కలెక్టర్ ఆగ్రహం
- నోటీసులు ఇవ్వనున్న ప్రత్యేక అధికారి
- మూడు తప్పులు దాటేసిన దుర్గాప్రసాద్
- రివ్యూలకు గైర్హాజరుపై గతంలోనే సంజాయిషీ

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

సంక్రాంతి సెలవులకు సొంతవూరు వెళ్లి మళ్లీ విధుల్లో చేరిన నగరపాలక సంస్థ కమిషనర్ దుర్గాప్రసాద్‌కు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఝలక్ ఇచ్చారా..? అంటే అవుననే అంటున్నాయి కలెక్టరేట్ వర్గాలు. నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్‌కు సమాచారం ఇవ్వకుండా, ముందస్తు అనుమతి తీసుకోకుండా సెలవు పెట్టినందుకు నగరపాలక సంస్థ కమిషనర్‌కు కలెక్టర్ నోటీసులు ఇవ్వడానికి సిద్ధమయ్యారని విశ్వసనీయ వర్గాల భోగట్టా. ఇప్పటికే రెండుసార్లు మందలించినా కమిషనర్ వినిపించుకోనందున మూడోసారి ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఈ నెల 11న మూడోసారి కలెక్టర్ అనుమతి తీసుకోకుండా సెలవు పెట్టి 17న విధుల్లో చేరేందుకు వచ్చిన కమిషనర్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. పనిలో పనిగా కమిషనర్‌కు కేటాయించిన వాహనాన్ని వారం రోజుల పాటు వెనక్కి తీసుకుంటూ ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిసింది. కానీ శుక్రవారం మళ్లీ విధుల్లో చేరిన కమిషనర్ నగరంలోని అనేక ప్రాంతాలు పర్యటించారు.

గత ఏడాది నవంబర్ 9న జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమీక్షకు హాజరు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాద్‌కు కలెక్టరేట్ నుంచి సమాచారం ఇచ్చారు. కాని ఆ సమావేశానికి హాజరు కాకుండా సెలవుపై వెళ్లిపోయారు. సమావేశానికి హాజరు కానివారిని హెచ్చరిస్తూ సంజాయిషీలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా అధికారులు సెలవుపై వెళితే తప్పనిసరిగా కలెక్టర్ అనుమతి తీసుకోవాలని జెడ్పీ సమావేశంలో సూచించారు. దీన్ని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాద్ రెండుసార్లు ధిక్కరించారు. సెలవు కావాలని మున్సిపల్ శాఖ డైరెక్టర్‌కు మెయిల్ చేసి, అందులో కాపీ టు అంటూ నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్‌కు ఒక మెయిల్ చేశారని తెలిసింది. దీన్ని తప్పుపడుతూ మెయిల్ చేసే బదులు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. అనుమతి తీసుకోవాలని చెప్పినా చెప్పాపెట్టకుండా సమాచారం ఇవ్వకుండా మూడోసారి సెలవుపై వెళ్లడాన్ని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ నోటీసులు జారీ చేసి కమిషనర్‌కు కేటాయించిన వాహనాన్ని వారం రోజుల పాటు వెనక్కి తీసుకుంటూ నోటీసులు జారీ చేసినట్టు విశ్వసనీయ సమాచారం. నిబంధనల ప్రకారం నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారిగా ఉన్న కలెక్టర్‌కు సమాచారం ఇవ్వకుండా డైరెక్టర్ నుంచి అనుమతి తీసుకొని సెలవుపై వెళ్లడం కుదరదని నోటీసులో పేర్కొంటూ కొన్ని సెక్షన్లను ఉదహరించారని తెలిసింది. కమిషనర్‌కు వారం రోజుల పాటు వాహనం నిలుపుదల చేయడానికి మొదట మున్సిపాలిటీ 1965 చట్టాన్ని ప్రస్తావించి నోటీసులు తయారుచేసిన కలెక్టరేట్ అధికారులు కలెక్టర్ సూచనలతో ఆ తర్వాత జీహెచ్‌ఎంసీ రూల్స్‌ను అనుసరించి నోటీసులు తయారుచేసినట్టు తెలిసింది.

ఇదిలా ఉండగా, కమిషనర్‌గా ప్రసాద్ రాజకీయంగా తీవ్ర ఒత్తిడితో ఉన్నారని తెలిసింది. నిబంధనలకు విరుద్ధంగా ఫైల్స్‌పై సంతకాలు చేయాలని ఒత్తిడి పెరగడమే తరచూ సెలవుపై వెళ్లిపోవడానికి కారణమని తెలుస్తుంది. కార్పొరేషన్ కార్యాలయంలో ఏం జరుగుతుందో, అంతకు క్రితం ఏం జరిగిందో కనీస సమాచారం ఆయన వద్ద లేకపోవడం వల్ల సమీక్షలకు హాజరుకాకుండా దుమ్మా కొడుతున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. సంతకాలు చేయకుండా కొన్ని ఫైల్స్‌ను తన టేబుల్‌పైనే అంటిపెట్టుకొని ఉన్నారని విశ్వసనీయ సమాచారం. రోజుల తరబడి సంతకాలు పెట్టకుండా కాలయాపన చేస్తున్నారని సమాచారం. ఆ ఫైల్స్‌పై సంతకాలు చేయాలని రాజకీయ నాయకుల నుంచి తీవ్ర ఒత్తిడి ఉందని, ఈ విషయం పలుమార్లు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినా ఆయన స్పందించలేదని తెలిసింది. దీంతో ఉద్దేశపూర్వకంగానే తరచూ సెలవుపై వెళుతున్నట్టు చెప్పుకుంటున్నారు. కమిషనర్‌గా విధుల్లో చేరిన రోజు నుంచే కూటమి పార్టీ నాయకుల నుంచి ఏదో ఒక విధంగా ఒత్తిడి వస్తునే ఉందని నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నారు. దీంతో కమిషనర్‌గా ప్రసాద్ శ్రీకాకుళంలో పని చేయడానికి నిరాశక్తత చూపిస్తున్నారని తెలిసింది. అందులో భాగంగానే కలెక్టర్ ఇచ్చిన నోటీసులతోనైనా విముక్తి కలుగుతుందన్న భావనతో కమిషనర్ ప్రసాద్ ఉన్నట్టు తెలిసింది. గతంలో ఇక్కడ అనేక అభివృద్ధి పనుల్లో, వాటి బిల్లుల చెల్లింపులో అవకతవకలు జరిగాయి. ప్రభుత్వం మారిన తర్వాత అప్పటి వరకు పనిచేసిన కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులు బదిలీపై వెళ్లిపోయారు. అసలు ఏ పని ఎంత వరకు జరిగింది? ఎంతమేరకు బిల్లుల చెల్లింపు జరిగిందన్న డేటా కార్పొరేషన్ కార్యాలయంలో లేదు. ఇటీవల జనరల్ ఫండ్స్‌తో, సుడా నిధులతో నగరంలో అనేక పనులు చేపడుతున్నారు. ఇందుకు సంబంధించి ప్రతి సమీక్షలోనూ కలెక్టర్ ఒక ప్రశ్నావళి సిద్ధం చేసుకొని పనుల్లో ప్రగతిని విచారిస్తున్నారు. కార్పొరేషన్‌లో కాంట్రాక్టర్ల వ్యవస్థ కూడా ఒక పద్ధతిలో లేదు. ఒకే వ్యక్తికి అనేక పనులు ఇవ్వడం, గతంలో బిల్లులు చెల్లింపులకు నోచుకోని వారికి ఇప్పటికీ మోక్షం కలగకపోవడం వంటివాటిపై గ్రీవెన్స్‌లో నిత్యం ఫిర్యాదులు అందుతున్నాయి. దీనికి తోడు టౌన్‌ప్లానింగ్ విభాగంలో అనధికారిక కట్టడాల మీద కుప్పలుతెప్పలుగా ఫిర్యాదులు ఉన్నాయి. దీంతో ఎవర్ని నమ్మాలో, ఎవర్ని దూరం పెట్టాలో తెలియక తన వద్దకు వచ్చిన ప్రతి ఫైల్ వైపు కమిషనర్ ప్రసాద్ అనుమానంగానే చూస్తున్నారు. చివరకు వేకెంట్ ల్యాండ్ టాక్స్ కడతాం మహాప్రభో, డిమాండ్ ఎంతో చెప్పండి అని దరఖాస్తు చేసుకున్నవారి అభ్యర్థనలు కూడా కమిషనర్ పట్టించుకోవడంలేదు. కారణం.. ల్యాండ్ లిటిగేషన్లు ఉన్నాయంటూ ఇప్పటికీ గత ప్రభుత్వంలో మున్సిపాలిటీలో పనులు చేయించుకున్న పెద్దలు అన్నింటికీ అడ్డు తగులుతున్నారు. దీంతో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ నుంచి లీగల్ ఒపీనియన్ తీసుకున్నా కూడా కమిషనర్ కొన్ని ఫైల్స్ వైపు కన్నెత్తి చూడటం లేదు. కలెక్టర్ గ్రీవెన్స్‌తో పాటు ఎమ్మెల్యే కూడా ప్రజా దర్బార్ నిర్వహిస్తుండటంతో కార్పొరేషన్‌కు చెందిన ఫిర్యాదులే ఎక్కువగా వస్తున్నాయి. వీటన్నింటి నడుమ చురుగ్గా పని చేయడం కుదరడంలేదనే భావన కమిషనర్‌కు ఉంది.

# పరిశుభ్రతలో ఆంధ్రప్రదేశ్ దేశానికి రోల్‌మోడల్ కావాలి



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)**

పరిశుభ్రతలో ఆంధ్రప్రదేశ్ దేశానికే రోల్ మోడల్‌గా నిలవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ ఆకాంక్షించారు. కళ్లేపల్లిలో శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ భారతీయ కళలకు, సంస్కృతులకు నెలవుగా నిలుస్తున్న సంప్రదాయ గురుకులాన్ని మరింత అభివృద్ధి చేయాలన్నారు. భారతీయ నృత్య కలయిన కూచిపూడిని విద్యార్థులకు వారసత్వంగా అందిస్తున్న స్వాతి సోమనాథ్ సేవలను కొనియాడారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్రమైన రాష్ట్రాల్లో నెంబర్ వన్‌గా నిలపాలనే లక్ష్యంతో చంద్రబాబు కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే నెలలో మూడో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వివరించారు. అన్ని నివాసిత ప్రాంతాలు, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, పాఠశాలలు, ఆస్పత్రులు, బస్టాపులు, రైల్వేస్టేషన్లు, పరిశ్రమలు తదితర ప్రభుత్వ, ప్రైవేట్ సెక్టార్లలో పరిశుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రధానంగా పర్యావరణాన్ని పరిరక్షించడం, పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పడం, ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించడం, పర్యాటకులు, యాత్రికులు, పెట్టుబడిదారులను ఆహ్వానించే రీతిలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం, ఆర్థిక ప్రయోజనాలను మెరుగుపరచడం, పిల్లలు, భవిష్యత్తు తరాల వారికి పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం అనే లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గురుకులంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విశ్వక్సేన్‌కు మాతృ వియోగం

## - డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సంతాపం -



**(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)**

జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి, పార్టీ కార్యక్రమాల నిర్వహణ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ విశ్వక్సేన్ మాతృమూర్తి కాంతిశ్రీ మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందారు. కాంతిశ్రీ మృతి పట్ల రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ సంతాపం వ్యక్తం చేస్తూ మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ పట్ల కాంతిశ్రీకి, ఆమె కుటుంబానికి ఉన్న నిబద్ధత, గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి చేసిన కృషిని కొనియాడారు. ఉత్తరాంధ్రలో పార్టీ చేపట్టిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించిన కాంతిశ్రీ మృతికి చింతిస్తూ ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచీ కాంతిశ్రీ జనసేనలో కార్యకర్తగా క్రియాశీలకంగా పని చేశారు. జనసేన సిద్ధాంతాలకు ఆకర్షితులైన కాంతిశ్రీ పార్టీ ఆవిర్భావం నుంచి పవన్ కళ్యాణ్‌తో నడిచి మొదట శ్రీకాకుళం ఆ తర్వాత ఎచ్చెర్లలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పవన్‌కళ్యాణ్ పిలుపుతో నిర్వహించిన అనేక పార్టీ కార్యక్రమాలను శ్రీకాకుళం వేదికగా జిల్లా స్థాయిలో నిర్వహించారు. జనసేన సీనియర్ నాయకురాలిగా కొనసాగుతున్న కాంతిశ్రీ ఇద్దరు కుమారులు డాక్టర్ విశ్వక్సేన్, వినీల్ ప్రస్తుతం క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగుతున్నారు. విశ్వక్సేన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా, రాష్ట్ర స్థాయిలో పార్టీ కార్యక్రమాల నిర్వహణలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. వినీల్ పార్టీ ఎన్ఆర్ఐ విభాగంలో సేవలు అందిస్తున్నారు.

విశ్వక్సేన్ మాతృమూర్తి కాంతిశ్రీ మృతి పట్ల స్థానిక ఎమ్మెల్యే ఎన్ఈఆర్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, కూటమి ప్రజాప్రతినిధులు, జనసేన నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలుపుతూ నివాళులర్పించారు.

# ఎన్టీఆర్ ఆదర్శాలు కొనసాగిస్తాం

## - రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు -



(సత్యంన్యూస్, అమరావతి)

తెలుగుదేశం అధినేత నందమూరి తారక రామారావు స్ఫూర్తితో నిరంతరం పని చేస్తున్నామని, పార్టీ సభ్యత్వాలు కోటి మార్కు దాటడం తమకెంతో ఆనందంగా ఉందని, ఇదే నందమూరి తారక రామారావుకు తామిచ్చే నిజ నివాళి అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని విజయవాడలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీక ఎన్టీఆర్ అని, బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతిగా నిలిచి వారి అభ్యున్నతే ధ్యేయంగా పార్టీనీ, ప్రభుత్వాన్నీ బలోపేతం చేస్తూ ఎన్నో సాహసోపేత నిర్ణయాలకు ఆద్యుడిగా నిలిచారని కొనియాడారు. ఆయన ఆదర్శాలను కొనసాగిస్తూ అధినేత చంద్రబాబు అలుపెరుగక రాష్ట్ర ప్రగతికి పాటుపడుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు వెలువరిస్తూ, అమలు చేస్తూ విజన్ 2047 అమలుకు కట్టుబడి పనిచేస్తున్నారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అత్యంత క్రమశిక్షణకు, ముఖ్యంగా కార్యకర్తల ఆరోగ్య, ఆర్థిక భద్రతకూ కట్టుబడి ఉందని, అలాగే ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమంలోనూ వారంతా భాగస్వాములు అవుతున్నారని, జెండామోసిన వారికి ఎప్పుడూ తగు న్యాయం ఉంటుందని అచ్చెన్న అన్నారు.

# ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించాలి

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ద్విచక్ర వాహనాలు నడిపేవారంతా విధిగా హెల్మెట్లు ధరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. శనివారం జిల్లా కోర్టు సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలొ మౌలానా మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. ప్రతిఒక్కరు హెల్మెట్ విధిగా ధరించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టులో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులకు హెల్మెట్లు అందజేశారు. ఈ హెల్మెట్ పంపిణీ కార్యక్రమానికి ఆంధ్ర ఆర్గానిక్ లిమిటెడ్ పైడి భీమవరం, పంజాబ్ నేషనల్ బ్యాంక్ సూర్యమహల్ బ్రాంచ్, ఇండియన్ బ్యాంక్ మహిళా కళాశాల బ్రాంచ్ అరసవిల్లి స్వచ్ఛందంగా హెల్మెట్ల అందజేశారు. అవగాహన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఆర్. సన్యాసినాయుడు, 1వ అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు, 3వ అదనపు జిల్లా జడ్జి సిహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్, 4వ అదనపు జిల్లా జడ్జి ఎస్ఎం ఫణికుమార్, 6వ అదనపు జిల్లా జడ్జి సోంపేట, కె.కిషోర్‌బాబు, సీనియర్ సివిల్ జడ్జ్ రాజాం, కె.శారదాంబ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కెవిఎల్ హిమబిందు, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ సిహెచ్ యుగంధర్, సీనియర్ సివిల్ జడ్జి, సోంపేట, జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జిలు పాల్గొన్నారు.



# రాజకీయ రంగాన్ని పూర్తిగా మార్చిన ఘనుడు ఎన్టీఆర్

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

తెలుగు సినీ వినీలాకాశంలో ధ్రువతారగా వెలిగి, రాజకీయ జీవితంలో తెలుగుదేశంపార్టీని పెట్టి రాజకీయ రంగాన్ని పూర్తిగా మార్చిన ఘనత దివంగత నందమూరి తారక రామారావుదని మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పేర్కొన్నారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం అరసవల్లిలోని గుండ స్వగృహంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటు సినీ రంగంలోనూ, ఇటు రాజకీయ రంగంలోనూ ఆయన ఖ్యాతి సూర్యచంద్రులున్నంత వరకు ఉంటుందన్నారు. ఎన్టీఆర్ రాజకీయ ప్రస్థానం ఒక చారిత్రాత్మక ఘట్టమని, తెలుగువారి ఆత్మగౌరవం పెంచే మహోన్నత వ్యక్తి విశ్వవిఖ్యాత నటసార్వభౌమడని వారు కొనియాడారు.








• ఎడిటోరియల్

# భక్తి వ్యాపారం పెరిగింది..!

తిరుపతి తొక్కిసలాటలో ఆరుగురి ప్రాణాలు పోయాయి. ఈ ఆలయానికి ఉన్న జాతీయ, అంతర్జాతీయ పేరు ప్రఖ్యాతుల వల్ల ఈ సంఘటన మరింత సంచలనమైంది. దీనికి కొద్ది రోజుల ముందు 'మా ఆలయాలను మాకే అప్పగించండి' అని విజయవాడలో శంఖారావం పూరించిన పీఠాధిపతులు, మఠాధిపతులు మాత్రం మరణించిన ఈ భక్తుల కుటుంబాలను ఒక్కరిని కూడా పరామర్శించిన దాఖలా లేదు. వైకుంఠ దర్శనం కూడా వ్యాపారమేనా? వైకుంఠ దర్శనం కొద్దిమంది పూజారులు, అగ్రకులాల్లోని సంపన్నులు మాత్రమే చేసేదిగా ఉండేది. ప్రజలకు అంతగా తెలిసేది కాదు. అయితే ప్రచార ప్రభావంతో తొలి ఏకాదశి రోజున తెల్లవారుజామునే రాష్ట్రంలో అనేక చిన్న, పెద్ద దేవాలయాల ముందు ఏడాదికేడాది భారీ క్యూలైన్లు పెరిగిపోతున్నాయి. దీనివల్ల ఆలయాలకు ఆదాయంతో పాటు అనేక వ్యాపారాలు పెరిగాయి. అందుకే ఒక్కరోజు జరగాల్సిన వైకుంఠ దర్శనాన్ని గత 25 ఏళ్లుగా ఆ మరుసటి రోజు ద్వాదశి రోజుకు పెంచి దేశ, విదేశాల్లో ప్రచారం చేశారు. మరింతగా రద్దీ పెరగడంతో ఈ ద్వారాన్ని ఏకంగా 10రోజుల వరకు తెరచివుంచాలని గత ప్రభుత్వ కాలంలో టీటీడీ నిర్ణయించింది. అప్పటి వరకు రోజుకు 10వేల మందికి మాత్రమే ఉన్న దర్శన భాగ్యాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం 60 నుంచి 75వేల మందికి పెంచింది. అంటే 10 రోజుల్లో 7 లక్షల మంది వైకుంఠ ద్వారం ద్వార దర్శనం చేసుకోవచ్చు. ఒక్క వైకుంఠ దర్శనమే కాదు.. పుష్కరాలకు, కుంభమేళాలకు, అయ్యప్ప, భవానీ, వేంకటేశ్వర మాలలు, ప్రవచన సభలకు, స్వస్థత సభలకు ఇలా ఒక్కటేమిటి భక్తి కార్యాలన్నింటికీ జనం పెద్ద సంఖ్యలో వెళ్తున్నారు. ప్రజల మనస్సుల్లో తరతరాలుగా నాటుకున్న విశ్వాసాన్ని వ్యాపార సరుకుగా మార్చి కంపెనీలు, రాజకీయాలకు వాడుకొని పాలక పార్టీలు లాభపడుతున్నాయి. ప్రత్యేక దర్శనాలు, పుష్కరాలు, మేళాలు, ఇష్టమాలు, స్వస్థత సభలకు లక్షల సంఖ్యలో జనాన్ని పోగేస్తున్నారు. అసౌకర్యాల నడుమ జరుగుతున్న తొక్కిసలాటల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటి వరకు దేశంలో జరిగిన కొన్ని ప్రధాన తొక్కిసలాటల్లో చనిపోయిన వారిలో అత్యధికులు పేదలు, శూద్రులు, దళితులు, గిరిజనులు మాత్రమే. 1954 ఫిబ్రవరి 3న అలహాబాద్ కుంభమేళాలో దాదాపు 800 మంది, 1986 ఏప్రిల్ 14 హరిద్వార్లో 46 మంది, 1996 జులై 15న మధ్యప్రదేశ్ ఉజ్జయిని ఘటనలో 60మంది, 1999 జనవరి 14న శబరిమలై దుర్ఘటనలో 53మంది, 1996 సెప్టెంబరు 18న కోల్కతాలో 35 మంది, 2003 ఆగస్టు 27న నాసిక్ కుంభమేళాలో 29 మంది, 2005 జనవరి 25న మహారాష్ట్ర సతారాలో 300 మంది, 2008 సెప్టెంబరు 30న రాజస్థాన్లోని చాముండి ఆలయ దుర్ఘటనలో 249 మంది, అదే ఏడాది ఆగస్టు 3న హిమాచల్ప్రదేశ్లో నైనాదేవి ఆలయం వద్ద 162 మంది, 2010 మార్చి 4న ఉత్తరప్రదేశ్ రాంజానకీ ఆలయంలో చోటు చేసుకున్న దుర్ఘటనలో 63 మంది, 2011 జనవరి 14న శబరిమలై సంఘటనలో 106 మంది మృత్యువాత పడ్డారు. 2013 అక్టోబరు 14న మధ్యప్రదేశ్లో దేవీ నవరాత్రుల సందర్భంగా 115 మంది, అదే ఏడాది అలహాబాద్ కుంభమేళాలో 37 మంది, 2015 జులై 14న రాజమండ్రి గోదావరి పుష్కరాల్లో 28 మంది మరణించారు. ముస్లిం, క్రైస్తవ మత కార్యక్రమాల్లో కూడా ఇలాంటి మరణాలు అనేకం జరిగాయి. 2000 తర్వాత పూర్తిగా మతపరమైన కార్యక్రమాలు మాత్రమే ప్రసారం చేసే ఛానళ్లు దేశంలోనూ, రాష్ట్రంలోనూ పెరిగాయి. వ్యాపారానికి మతంతో పని లేదనేందుకు చక్కటి ఉదాహరణ 'జీ ఎంటర్టైన్మెంట్ నెట్వర్క్'. ఈ సంస్థ 2003లో 'జీ జాగరణ్' అనే హిందూ మత భక్తి ఛానల్ని, 2010లో 'జీ సలామ్' అనే ఇస్లాం భక్తి ఛానల్ను ప్రారంభించింది. ఎవరికి ఏం కావాలో అది చూపించడం అందరికీ మాత్రం కంపెనీల ప్రకటనలను ప్రచారం చేసి దేశీయ చిన్న, మధ్యతరహా కంపెనీలను దివాళా తీయించడం. టీవీలు మాత్రమే కాదు, యూట్యూబ్ ఛానళ్లు, పత్రికలు అనేకం భక్తి పేరుతో అత్యధిక లాభాల్లో నడుస్తున్నాయి. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇది మరింతగా పెరిగింది. రాందేవ్ పతంజలి వ్యాపారం వేల కోట్లకు పెరిగింది. దేరా బాబా లాంటివారు శతకోటీశ్వరులయ్యారు. ప్రభుభక్తిని ప్రదర్శించుకోవడానికి అనేక మంది పెట్టుబడిదారులు ప్రత్యేక భక్తి ఛానళ్లు పెట్టడం లేదా ప్రజాదరణ పొందిన ఛానళ్లలో భక్తి కార్యక్రమాల కోసం కోట్లు ఖర్చు చేస్తున్నారు. వీటి ద్వారా కార్పొరేట్ కంపెనీలకు, బిజెపికి ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నాయి. తమ సరుకుల ప్రచారంతో పాటు, లాభాలు రావడం కంపెనీల ప్రయోజనమైతే, ప్రజల విశ్వాసాలను ఉపయోగించుకుని రాజ్యాధికారాన్ని కొనసాగించడం కేంద్ర ప్రభుత్వానికి ప్రయోజనం. వీరి మాయలో పడకుండా సాధారణ ప్రజలను కాపాడుకోవడం లౌకిక, ప్రజాతంత్రవాదుల బాధ్యత. లేకపోతే పండుగలు, ఉత్సవాలు, పుష్కరాలు, కుంభమేళాలు వ్యాపారంగా మారిపోతాయి.

## ఎన్డీయే ప్యాకేజీతో విశాఖ ఉక్కుకు జీవం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఎన్డీయే ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం భారీ ప్యాకేజీ ప్రకటించి విశాఖ ఉక్కుకు జీవం పోసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. వైకాపా హయాంలో విశాఖ ఉక్కును నిర్లక్ష్యం చేశారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయకుండా నిలుపుదల చేయడమే కాకుండా భారీ ప్యాకేజీ ప్రకటించడం హర్షణీయమని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. రెండేళ్లలో విశాఖ స్టీల్ప్లాంట్ దేశంలోనే నంబర్వన్గా నిలుస్తుందని, స్టీల్ప్లాంటును అప్పుల్లో నుంచి బయటకు తేవడమే ప్రథమ కర్తవ్యంగా ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

రూ.11,440కోట్ల ప్యాకేజీకి నిర్ణయంతో రాష్ట్రప్రజలు, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదం ప్రజల గుండెల్లో ఎప్పటికీ సజీవమే అని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. రాష్ట్ర ప్రజలు, ఉత్తరాంధ్ర ప్రజల తరపున ప్రధాని మోదీకి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి అచ్చెన్నాయుడు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి ఆర్థిక సహాయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




గార మండలం, తాళ్ళవలస గ్రామానికి చెందిన మూడేళ్ల చిన్నారి తాన్ని హరనందన్ ఎదుగుతున్నా మాటలు రాక, కాళ్ళు చచ్చుబడటంతో డాక్టర్లని సంప్రదించి పరీక్షలు నిర్వహించగా తల ఉడికించిన గుడ్డు వలే మెత్తగా సున్నితంగా ఉందని, కడుపులో కాయలు ఉన్నాయని చెప్పారు. ఈ దంపతులు అప్పటికే రకరకాల మందులు, ఆసుపత్రి ఖర్చులకు ఉన్నదంతా ఖర్చు చేయటంతో ఇంకా వైద్యం చేసినా ఫలితం ఉండదని చెప్పారు. దీంతో ఆ బాబు తల్లిదండ్రులు దుఃఖంలో మునిగారు. అయినా ఆశతో చాలా ఆసుపత్రులు తిప్పారు, ఫలితం లేకపోవడంతో పెయింట్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించే ఆ తండ్రి బాబు పరిస్థితిని, కుటుంబం ఆర్థిక పరిస్థితికి దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని ఆ పేద కుటుంబం సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితిని సహాయం కోసం సంప్రదించారు. వారికి శనివారం రూ.8వేలు రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో సభ్యులు పొడుగు అవినాష్, మధు, పొడుగు చరణ్, గోపి శిల్ల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సంప్రదాయాన్ని అభివృద్ధి చేస్తాం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రపంచంలోనే ఏకైక కూచిపూడి గురుకులంగా ఉన్న సంప్రదాయ గురుకులాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సంప్రదాయ గురుకులాన్ని పరిశీలించి అభివృద్ధి పనులపై డైరెక్టర్ స్వాతి సోమనాథ్తో చర్చించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కార్పస్ఫండ్తో సంప్రదాయ గురుకులాలన్నీ అభివృద్ధి చేయాలని సూచించినట్టు చెప్పారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుల సహకారంతో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ సూచనలతో కార్పస్ఫండ్ను సేకరిస్తున్నట్టు వివరించారు. ఇప్పటికే గురుకులంలో అభివృద్ధి పనులు ప్రారంభించామని త్వరలోనే పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలతో కూడిన అభివృద్ధి చేపడుతామని వివరించారు. కూచిపూడి తెలుగు వారి నృత్య రూపకమని పేర్కొన్నారు. పేద, గిరిజన విద్యార్థులను గొప్ప నాట్యకళాకారులుగా తీర్చిదిద్దాలనే కుతూహలంతో స్వాతి సోమనాథ్ ప్రారంభించిన సంప్రదాయ గురుకులం ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గురుకుల విద్యార్థినిలను ఎమ్మెల్యే శంకర్ పరిచయం చేసుకున్నారు. క్రమశిక్షణతో మెలిగి జిల్లా ఖ్యాతిని, కీర్తిని దేశ నలుమూలల చాటాలని వారికి సూచించారు.



టీడీపీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు 29వ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే కూన రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పేడాడ రామ్మోహన్, పేడాడ సూరపనాయుడు, పీరుకట్ల విశ్వప్రసాద్, తమ్మినేని చంద్రశేఖర్, ఆనెపు రామకృష్ణ, సనపల ఢిల్లేశ్వరరావు, నూకరాజు, ముఖ్య నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, ఆమదాలవలస

## వైజాగ్ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు రూ.11,500 కోట్ల ప్యాకేజీ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వైజాగ్ స్టీల్ప్లాంట్ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం రూ.11,500 కోట్ల ప్యాకేజీని మంజూరు చేసినట్లు కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విడుదల చేసిన ప్రకటనలో, ఈ విజయం కేవలం ఒక ఆర్థిక నిర్ణయం మాత్రమే కాదని, ఇది వైజాగ్ స్టీల్ప్లాంట్ కార్మికుల విజయం, ఆంధ్రప్రదేశ్ ప్రజల గర్వం, పట్టుదల, నిబద్ధత, శక్తికి నిదర్శనమన్నారు. ఈ విజయానికి కారణమైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిలకు రామ్మోహన్ నాయుడు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వైజాగ్ స్టీల్ప్లాంట్ కార్మికుల అచంచలమైన స్ఫూర్తికి ఆయన ప్రశంసలు కూడా తెలిపారు. గత ఐదేళ్లలో వైజాగ్ స్టీల్ప్లాంట్, సౌత్కోస్ట్ రైల్వేజోన్ సమస్యలను పార్లమెంట్లో అవిశ్రాంతంగా లేవనెత్తినట్లు రామ్మోహన్ నాయుడు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు కేవలం ఒక వారం వ్యవధిలో, సౌత్ కోస్ట్ రైల్వే జోన్కు శంకుస్థాపన, వైజాగ్ స్టీల్ప్లాంట్ పునరుద్ధరణ వంటి రెండు ప్రధాన విజయాలను సాధించామన్నారు. ఈ విజయం ప్రతి తెలుగువారికి సంక్రాంతి కానుకగా నిలుస్తుందని రామ్మోహన్ నాయుడు అన్నారు. ఐకమత్యం, సకల్పంతో పోరాడిన ఈ విజయం ప్రతి తెలుగువారికి సంక్రాంతి కానుకగా నిలుస్తుందని ఆయన తెలిపారు.




**నటీనటులు:** వెంకటేష్-ఐశ్వర్యా రాజేష్-మీనాక్షి చౌదరి-నరేష్-వీటీవీ గణేష్-మురళీధర్ గౌడ్-అవసరాల శ్రీనివాస్-ఉపేంద్ర లిమాయె-సాయికుమార్ తదితరులు
**సంగీతం:** భీమ్స్ సిసిరోలియో
**ఛాయాగ్రహణం:** సమీర్ రెడ్డి
**నిర్మాత:** శిరీష్
**రచన-దర్శకత్వం:** అనిల్ రావిపూడి

**ఎఫ్-2.. ఎఫ్-3 లాంటి ఎంటర్టైనర్ల తర్వాత విక్టరీ వెంకటేష్-అనిల్ రావిపూడిల క్రేజీ కాంబినేషన్లో తెరకెక్కిన కొత్త చిత్రం.. సంక్రాంతికి వస్తున్నాం. సంక్రాంతికి కానుకగా ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ ఫ్యామిలీ ఎంటర్టైనర్ విశేషాలేంటో చూద్దాం పదండి.**

# టైంపాస్!

**కథ:**
వైడీ రాజు (వెంకటేష్) మాజీ పోలీసాఫీసర్. తాను ఎంతో నిబద్ధతతో పని చేసినా డిపార్ట్మెంట్ తనకు అన్యాయం చేసిందన్న కోపంతో ఉద్యోగం వదిలేసి.. భాగ్యం (ఐశ్వర్యా రాజేష్)ను పెళ్లి చేసుకుని ఒక పల్లెటూరిలో సెటిలైపోతాడు. నలుగురు పిల్లల్ని కని కుటుంబంతో సంతోషంగా గడుపుతున్న అతను.. తన మాజీ ప్రేయసి అయిన పోలీసాఫీసర్ మీనాక్షి (మీనాక్షి చౌదరి) కోసం ఒక ఆపరేషన్లో పాల్గొనాల్సి వస్తుంది. కానీ భర్త మీద అనుమానంతో అతణ్ని ఒంటరిగా పంపించడానికి భాగ్యం ఒప్పుకోదు. ఆమె కూడా ఈ ఆపరేషన్లో భాగం కావాలని అనుకుంటుంది. ఇంతకీ ఈ ఆపరేషన్ ఏంటి.. భార్య-మాజీ ప్రేయసి మధ్య నలిగిపోతూ రాజు ఈ ఆపరేషన్ ను ఎలా విజయవంతంగా ముగించాడు అన్నది మిగతా కథ.

**కథనం-విశ్లేషణ:**

ఒక పేరున్న బిజినెస్మ్యాన్ను కిడ్నాప్ చేసి పెద్ద రౌడీ అయిన తన అన్నను విడుదల చేయాలని సీఎంకే ఫోన్ చేసి డిమాండ్ చేస్తాడు మరో రౌడీ. సర్లే ఆ రౌడీని విడిపించేద్దాం అని అతనున్న జైలు సూపరింటెండ్ ను పిలిపిస్తే.. అతను చాలాస్ట్రిక్ట్ అని అర్థమై ఏం చేయాలో తెలియక తల పట్టుకుంటాడు సీఎం. ఈ స్థితిలో ఎప్పుడో ఏడేళ్ల ముందు పోలీస్ ఉద్యోగం మానేసిన హీరోను వెతికి మరీ పట్టుకుని ఈ సమస్యను పరిష్కరించే బాధ్యతను అప్పగిస్తాడు ఆ ముఖ్యమంత్రి. సీఎం స్థాయి వ్యక్తికి ఒక ఆకు రౌడీ వీడియో కాల్ చేసి బెదిరించడమేంటో.. ఒక జైలు సూపరిండెంటుని ఎలా డీల్ చేయాలో తెలియక సీఎం తల పట్టుకోవడమేంటో.. ఇంకెవరూ లేనట్లు మాజీ పోలీసుని ఆపరేషన్ కోసం రప్పించడమేంటో..? ఇలా లాజికల్గా ఆలోచిస్తే 'సంక్రాంతికి వస్తున్నాం' బేసిక్ స్టోరీ దగ్గరే ప్రేక్షకుడు స్టక్ అయిపోవవడం ఖాయం. ఐతే అనిల్ రావిపూడి సినిమాలంటే లాజిక్ అటక మీద పెట్టేసి థియేటర్లో కూర్చోవాల్సి ఉంటుంది. కథ కాకరకాయ అంటూ ఏమీ ఆలోచించకుండా.. లాజిక్కుల గురించి గిలగిలా కొట్టేసుకోకుండా.. సన్నివేశాల్లోని వినోదాన్ని మాత్రమే ఆస్వాదించడం మొదలు పెడితే 'సంక్రాంతికి వస్తున్నాం' ఈజీగానే టైంపాస్ చేయించేస్తుంది.

విక్టరీ వెంకటేష్కు ఫ్యామిలీ టచ్ ఉన్న కామెడీ క్యారెక్టర్ పడితే ఆయనెలాగూ చెలరేగిపోతారని తెలిసిందే. అనిల్ అలాంటి పాత్రనే డిజైన్ చేశాడు. అమాయకమైన పల్లెటూరి ఇల్లాలిగా ఐశ్వర్యా రాజేష్కు సైతం చక్కటి పాత్రను తీర్చిదిద్దాడు. వీళ్లిద్దరి పెర్ఫామెన్సుకు.. ఫన్ సీన్స్ తోడవడంతో 'సంక్రాంతికి వస్తున్నాం' రెండున్నర గంటల్లో చాలావరకు బోర్ కొట్టకుండా సాగిపోయింది. పల్లెటూరిలో భార్యతో కలిసి చక్కగా సంసారం చేసుకుంటున్న భర్త జీవితంలోకి మాజీ ప్రేయసి వస్తే.. ఆ ఇల్లాలు ఎలా రగిలిపోతుంది.. తన నుంచి విడిపోయాక పెళ్లే చేసుకోను అన్న మాజీ ప్రియుడు నలుగురు పిల్లల్ని కూడా కన్నాడని తెలిసిన ప్రేయసి ఎలా ఉడుక్కుంటుంది.. తప్పనిసరి పరిస్థితుల్లో వీళ్లిద్దరితోనూ కలిసి కొన్నిరోజులు ప్రయాణం చేయాల్సినస్థితిలో ఆ వ్యక్తి ఎలా నలిగిపోయాడు అన్నది సరదాగా చూపిస్తూ నవ్వులు పంచే ప్రయత్నం చేశాడు అనిల్ రావిపూడి. ఈ నేపథ్యమే సినిమాను ముందుకు నడిపించింది. ఇక పైన చెప్పుకున్న కిడ్నాప్ డ్రామా అంతా మసిబూసి మారేడు కాయను చేసే టైపే. సినిమాలో ఏదో ఒక కథ ఉంది అంటే ఉంది అన్నట్లుగా ఈ వ్యవహారాన్ని నడిపించింది అనిల్ అండ్ టీం. వెంకీ-ఐశ్వర్యల కెమిస్ట్రీనే 'సంక్రాంతికి వస్తున్నాం'కు ఆయువు పట్టు. ఇద్దరూ పోటీ పడి నటించడంతో వాళ్ల మధ్య వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులకు మాగ్జిమ్ ఎంటర్టైన్మెంట్ ఇస్తాయి. ఓటీటీల్లో ఈతరం సినిమాలు చూసి బాగా బూతులు వంటబట్టించేసుకుని అందరి మీదా ప్రయోగించే పిల్లాడిగా బుల్లిరాజు అనే పాత్రతో పండించిన వినోదం 'సంక్రాంతికి వస్తున్నాం'లో హైలైట్. ఆ పిల్లాడు తొలిసారి విశ్వరూపం చూపించే సన్నివేశం కడుపుబ్బ నవ్విస్తుంది. ఆ పిల్లాడు కూడా చలాకీగా నటించడంతో సినిమాలో అతను కనిపించినపుడల్లా ప్రేక్షకులు ఎంటర్టైన్ అవుతారు. ఇలాంటి పాత్రలు ఇంకొన్ని ఉంటే కామెడీ డోస్ ఇంకా పెరిగేది. ఐతే మరాఠీ నటుడు ఉపేంద్ర లిమాయె పోషించిన జైలర్ పాత్రతో నవ్వులు పూయించాలని చేసిన ప్రయత్నం మాత్రం పెద్దగా ఫలించలేదు. మరీ డంబ్గా తీర్చిదిద్దిన ఆ పాత్ర సిల్లీగా అనిపిస్తుందే తప్ప దాంతో ముడిపడ్డ సీన్లు అనుకున్నంత నవ్వించలేకపోయాయి. హీరో ఎంట్రీ దగ్గర్నుంచి తన కుటుంబంతో పల్లెటూరిలోనే ఉన్నంత వరకు వినోదానికి ఢోకా లేకపోయింది. కుటుంబం నేపథ్యంలో వచ్చే సన్నివేశాలన్నీ సరదాగా అనిపిస్తాయి. ఐతే హీరో ఆపరేషన్లో భాగమయ్యే దగ్గర్నుంచే 'సంక్రాంతికి వస్తున్నాం' ట్రాక్ తప్పుతున్న ఫీలింగ్ కలుగుతుంది. ద్వితీయార్ధంలో కామెడీ పేరుతో పాత్రలతో చేయించిన విన్యాసాలు మరీ సిల్లీగా అనిపిస్తాయి. ఓవర్ ద టాప్ స్టయిల్లో సాగే సీన్లు ఆశించినంత ఎంటర్టైన్మెంట్ ఇవ్వలేకపోయాయి. ఎంత లాజిక్ పక్కన పెట్టిచూసినా కొన్ని సీన్లు మరీ వెటకారంగా అనిపిస్తాయి. చచ్చిన వ్యక్తి బతికి ఉన్నట్లు మేనేజ్ చేస్తూ అందరినీ బోల్తా కొట్టించే సీన్లు అందులో భాగమే. ఈ తరహా కామెడీ ఎప్పుడో దశాబ్దాల కిందట చూశాం. ఇంకా ఇలాంటి సీన్ల మీద ఆధారపడడం అంటే.. రైటింగ్ పరంగా ఏమాత్రం కసరత్తు చేయక పోవడమే. అక్కడక్కడా కొంత కామెడీ వర్కవుట్ కావడం వల్ల ద్వితీయార్ధం సోసోగా సాగిపోతుంది కానీ.. ప్రథమార్ధంతో పోలిస్తే నిరాశ తప్పదు. సినిమా అయిపోయింది అనుకున్నాక ఎమోషనల్ యాంగిల్ ఏదో జోడించాలని కథను ఇంకొంచెం సాగదీశారు. హీరో గురువు పాత్ర నేపథ్యంలో వచ్చే ఆ ఎపిసోడ్ పూర్తిగా అనవసరం అనిపిస్తుంది. ఓవరాల్గా చెప్పాలంటే.. సంక్రాంతి టైంలో ఫ్యామిలీతో కలిసి ఎంజాయ్ చేయదగ్గ కాలక్షేపం వినోదానికైతే ఇందులో ఢోకా లేదు.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...

**నటీనటులు:**
వెంకటేష్కు సరిగ్గా నప్పే పాత్ర చేశాడు 'సంక్రాంతికి వస్తున్నాం'లో. వయసుకు తగ్గ.. తన కామెడీ టైమింగ్ కు సరిపోయే పాత్ర కావడంతో ఆయన చెలరేగిపోయారు. ఆయన లుక్ చాలా బాగుంది. స్క్రీన్ ప్రెజెన్స్.. కామెడీ టైమింగ్ అదిరిపోయాయి. అన్ని వర్గాల ప్రేక్షకులూ ఆయన పాత్రతో కనెక్ట్ అవుతారు. కామెడీ పండించడంలో సీనియర్ హీరోల్లో ఎవరైనా తన తర్వాతే అని వెంకీ మరోసారి రుజువు చేశారు. ఎప్పట్లాగే ఇమేజ్ గురించి ఆలోచించకుండా.. ఏమాత్రం భేషజం లేకుండా ఆయన చేసిన సీన్లు అందరినీ ఆకట్టుకుంటాయి. అమాయక పల్లెటూరి ఇల్లాలిగా ఐశ్వర్యా రాజేష్ కూడా అదరగొట్టింది. వెంకీ తర్వాత సినిమాలో ఆమెదే బెస్ట్ పెర్ఫామెన్స్. తన కామెడీ టైమింగ్ కూడా బాగుంది. మీనాక్షి చౌదరి అందంగా.. ఆకర్షణీయంగా కనిపించింది. నటన పర్వాలేదు. వెంకీ కొడుకుగా బుల్లిరాజు పాత్రలో చేసిన పిల్లాడు అదరగొట్టాడు. మురళీధర్ గౌడ్ నవ్వించాడు. వీటీవీ గణేష్ మొదట్లో కాసేపు నవ్వులు పండించాడు. కానీ ఆ తర్వాత ఆ పాత్ర పెద్దగా కనిపించదు. ఉపేంద్ర లిమాయె కామెడీలో పెద్దగా రాణించలేకపోయాడు. సాయికుమార్.. శ్రీనివాసరెడ్డి.. నరేష్.. మిగతా ఆర్టిస్టులంతా ఓకే.

**సాంకేతిక వర్గం:**
తొలిసారి ఓ పెద్ద హీరోతో సినిమా అవకాశాన్ని సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియా బాగానే ఉపయోగించుకున్నాడు. తన పాటలు.. నేపథ్య సంగీతం సినిమాకు ఆకర్షణగా మారాయి. 'గోదారి గట్టు మీద..' వినడానికే కాదు.. చూడ్డానికి కూడా బాగుంది. ఆర్ఆర్ మంచి జోష్ తో సాగింది. సమీర్ రెడ్డి ఛాయాగ్రహణం కూడా బాగుంది. నిర్మాణ విలువలకు ఢోకా లేదు. సినిమాకు అవసరమైన స్థాయిలో ఖర్చు పెట్టారు. రైటర్ కమ్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ఎప్పట్లాగే కథ మీద పెద్దగా దృష్టిపెట్టలేదు. ఎక్స్ కాప్.. పల్లెటూరి పెళ్లాం.. వీరి మధ్య మాజీ ప్రేయసి.. అంటూ కామెడీకి స్కోప్ ఉన్న కాన్సెప్ట్ తీసుకుని వినోదం పండించడం మీదే దృష్టిపెట్టాడు. తన నరేషన్ ఓవర్ ద టాప్ స్టయిల్లో సాగడం ఒకింత నిరాశ పరుస్తుంది. కానీ ప్రేక్షకులకు టైంపాస్ వినోదాన్ని అందించడంలో మాత్రం అతను విజయవంతం అయ్యాడు.




ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)ని భారతీయ జనతా పార్టీ తల కిందులు చేసి నిరాశపరచగలదా? ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న ఎన్నికలు జరగను న్న నేపథ్యంలో పలువురు పరిశీలకుల మనసుల్లో మెదులుతున్న ప్రశ్న ఇది. ప్రధాని నరేంద్ర మోడీ, ఆప్ ను "ఆపద", ఒక విపత్తుగా, దాని పదేళ్ల పాలనా కాలాన్ని "ఆపదల కాలం"గా ముద్ర వేయడం ద్వారా ఒక అధికారిక ప్రకటన చేశాడు. అధికార ఆప్ ప్రభుత్వం అవినీతి మయమైందని చిత్రించేందుకు ముఖ్యమంత్రి నివాస పునరుద్ధరణ పనుల్లో అధికంగా చేసిన ఖర్చును, బీజేపీ తన పార్టీ ప్రచారంలో ప్రధాన సాధనంగా ఉపయోగించుకుంటుంది. గత ఆరు నెలల కాలంగా ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ పట్టణ పేదలలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకునేందుకు మొహల్లా సమావేశాలను నిర్వహిస్తూ, తన ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజల్లో ప్రచారం చేస్తూ, దేశ రాజధానిలో శాంతిభద్రతలు క్షీణించడానికి బీజేపీదే బాధ్యత అని, దానిపై ఒంటికాలిపై లేస్తున్నాడు. అమిత్ షా నేతృత్వంలోని కేంద్ర హెంశాఖ ఆధ్వర్యంలో ఢిల్లీ పోలీసులు తమ విధులను నిర్వహిస్తున్నారు.

# ఢిల్లీ పీఠం.. ఎవరికి సొంతం?

ఈ క్రమంలో 2013లో షీలా దీక్షిత్ ఓటమి పాలైన తర్వాత దెబ్బతిన్న కాంగ్రెస్ తిరిగి కోలుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. బీజేపీకి తాను మాత్రమే ఏకైక లౌకిక ప్రతిపక్షమనే విషయాన్ని చెపుతూ, ఆప్ సంక్షేమ పథకాలకు ధీటైన పథకాలను తాము కూడా తీసుకొస్తామని చెప్పేందుకు శాయశక్తులా ప్రయత్నం చేస్తోంది.

అయినప్పటికీ, ఆ రెండు పార్టీల నుండి ఆప్‌ను వేరు చేసేది, ప్రజాదరణ పొంది, తన పార్టీని ముందు నుంచి నడిపించిన కేజ్రీవాల్ మాత్రమే. మదన్ లాల్ ఖురానా లేక కనీసం సుష్మా స్వరాజ్ లాంటి ప్రజాకర్షణ కలిగిన బలమైన ఒక నాయకుడిని వెతకడంలో బీజేపీ తీవ్ర పోరాటం చేసింది.

2015లో కిరణ్ బేడీని ముఖ్యమంత్రి అభ్యర్థిగా దించాలనే బీజేపీ కపటోపాయం విఫలమైంది. 2020లో కేజ్రీవాల్, ఆయన టీంకు హర్ష వర్ధన్ సరితూగలేదు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీలో కూడా షీలా దీక్షిత్ లోటును పూడ్చగలిగే వారు కూడా ఎవరూ లేరు. అజయ్ మాకెన్, సందీప్ దీక్షిత్‌లు కాంగ్రెస్ కు ఉత్తములైన విశ్వాసపాత్రులే, కానీ పార్టీలో కూడా మురా దృష్టితోనే చూస్తారు.

1993లో ఢిల్లీ శాసనసభ ఏర్పాటైన నాటి నుండి దేశ రాజధానిలో అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ తీవ్రంగా పోరాడుతోంది. ఢిల్లీ ప్రభుత్వానికి నాయకత్వం వహించిన మదన్ లాల్ ఖురానా పదవీ కాలాన్ని మినహాయిస్తే, కాషాయ పార్టీ ఇతర పార్టీల కంటే మించిన బలాన్ని ఎప్పుడూ పొందలేక పోయింది. షీలా దీక్షిత్ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ 1998 నుండి వరుసగా మూడు ఎన్నికల్లో, మొదటిసారి ఆప్ అధికారం చెపట్టే వరకు, విజయం సాధించింది. 2013 లో స్వల్పకాలిక మైనార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత రెండు ఎన్నికల్లో 70 స్థానాలున్న శాసనసభలో 60 స్థానాలు గెలిచి ప్రత్యర్థుల్ని తుడిచి పెట్టింది. తన పార్టీ బలహీనతలను కప్పిపుచ్చడానికి బహుముఖ వ్యూహాలు రచించినప్పటికీ కూడా ఢిల్లీలో నాయకత్వలేమి, మోడీని, బీజేపీని నడిపించే పరిస్థితుల్లోకి నెట్టి వేసింది. లోక్ సభ ఎన్నికల్లో ఢిల్లీ ఓటర్లు మోడీ వైపు మొగ్గినప్పటికీ శాసనసభ ఎన్నికల్లో వారు ఆప్ వైపు మొగ్గారని అర్థమవుతోంది.

అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా అవినీతి, రాజ్య వారసత్వం ఆధారంగా బీజేపీ సమర్థవంతమైన రాజకీయ కథనం కలిగి ఉండగా, అది ఆప్‌కు వ్యతిరేకంగా అనుసరించాల్సిన తన వైఖరి ఎలా ఉండాలో ఇంత వరకు కనుగొనలేదు. వాస్తవానికి, ఆప్‌ను ఇరుకున పెట్టేందుకు ప్రయత్నించిన ప్రతీసారి కేజ్రీవాల్ బీజేపీని అధిగమించాడు. తన ప్రభుత్వాన్ని విద్యావంతులు నిర్వహిస్తున్నారన్న ఆప్ ప్రచారానికి వ్యతిరేకంగా అడుగులు వేస్తున్నప్పటికీ కూడా కేజ్రీవాల్ ఇటీవలి ముఖ్యమంత్రి పదవికి చేసిన రాజీనామా విషయంలో బీజేపీ వద్ద ఎలాంటి సమాధానం లేదు.

ఇలాంటి రాజకీయ పరిస్థితుల్లో, తన సంక్షేమ పథకాలు, ఆప్ నాయకులపై కేంద్ర ఏజెన్సీలు విచారణ చేపట్టిన అవినీతి ఆరోపణల గురించి మోడీ ప్రజల దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాడు. అదే విధంగా, కులమతాల ప్రాతిపదికన బీజేపీ ఓటర్లను విభజించే విధంగా దృష్టిని కేంద్రీకరిస్తుంది. న్యూఢిల్లీ స్థానానికి కేజ్రీవాల్‌పై మాజీ పార్లమెంట్ సభ్యుడు పర్వేశ్ వర్మను కాషాయ పార్టీ వ్యూహాత్మకంగా బరిలోకి దించింది.

పౌరసత్వ సవరణ చట్టానికి(సీఏఏ) వ్యతిరేకంగా నిరసనలు చేపట్టిన నాటి నుండి సంఘ్ పరివార్లో వర్మ ముఖ్యమైన ముస్లిం వ్యతిరేకులలో ఒకడిగా, తీవ్ర మతపరమైన వ్యాఖ్యలు చేసిన వ్యక్తిగా ప్రసిద్ధి చెందాడు. అదే రీతిలో కల్కాజీ స్థానంలో ముఖ్యమంత్రి అతిషీపై మాజీ ఎంపీ రమేష్ బిధూరీని పోటీకి దించింది. వర్మ మాదిరిగానే బిధూరీ కూడా మతపరమైన వ్యాఖ్యలు చేసే వ్యక్తిగా ప్రసిద్ధి చెందాడు. 2023లో లోక్ సభలో డానిష్ అలీతో జరిగిన ఘర్షణ అత్యంత క్రూరమైనది. ఆయన అక్కడ అలీని తాడ్పుడు గాడు అని, కత్వా (సుంతీ కోసం ఉపయోగించే అవమాన కరమైన పదం) అని, "ముల్లా ఆతంక్వాది" అని, "ముల్లా ఉగ్రవాది" అని అన్నాడు.

2020 ఎన్నికల సమయంలో ముస్లింలను "కుట్రదారులు", "జాతి వ్యతిరేకులు" అని ముద్ర వేయడానికి, ముస్లింలకు వ్యతిరేకంగా నిందలతో కూడిన ప్రచారం కోసం బీజేపీ సీఏఏ వ్యతిరేక నిరసనలను ఉపయోగించుకొని, మత ప్రాతిపదికన ఓటర్లను విభజించడానికి అనేక ప్రదర్శనలను నిర్వహించింది.

**విభజన వ్యూహాల కొనసాగింపు:**

రేపు 2025లో జరగబోయే ఎన్నికల్లో బీజేపీ తన విభజన వ్యూహాలకు ఒక నూతన అంశాన్ని అదనంగా చేర్చింది. పట్టణ పేదలలో ఎక్కువగా బీహార్, తూర్పు ఉత్తరప్రదేశ్ కు చెందిన పూర్వాంచలులు అని పిలువబడే ప్రజలు ఇప్పటికీ ఆప్ కు మద్దతుగా ఉన్నారని అర్థమైన తరువాత బీజేపీ, ఢిల్లీలో పంజాబీలు, జాట్లు, గుజ్జర్లకు చేరువయ్యే ప్రయత్నం చేస్తుంది.

ఢిల్లీలో పూర్వాంచలులు 40 శాతం ఓటర్లు కాగా, పంజాబీలు 20 శాతం, జాట్లు మరియు గుజ్జర్లు కలిసి 12 శాతం ఓటర్లు ఉన్నారు. వీరికి చేరువయ్యే కార్యక్రమంలో భాగంగా హోంశాఖమంత్రి అమిత్ షా ఇటీవలే, ఢిల్లీలోని సిక్కు రాజకీయ కేంద్రమైన రాకబ్ గంజ్ గురుద్వారాను సందర్శించాడు. అలాంటి ఆలోచనలో భాగంగానే బీజేపీ అసెంబ్లీ ఎన్నికల్లో అందరికీ సుపరిచితులైన వర్మ(జాట్)ను, బిధూరి (గుజ్జర్)ను పోటీకి దించింది. ఆ విధంగా పార్టీని నడిపించగల నాయకుడు లేని సమయంలో ఆప్ నుండి దృష్టిని మరల్చేందుకు కాషాయ పార్టీ మోడీ గుర్తింపు, కులం, మత విభజన, ప్రభుత్వ వ్యతిరేకతపై ఆధారపడుతుంది. కానీ మరీ ముఖ్యంగా, సాధారణంగా జరిగే ద్విముఖ పోటీగల ఎన్నికల్ని కాంగ్రెస్ పార్టీ త్రిముఖ పోటీగల ఎన్నికలుగా మార్చాలని బీజేపీ తీవ్రంగా ఆశిస్తోంది. రేపు జరగబోయే ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పనితీరు ముఖ్య కారకంగా ఉంటుంది.

నాయకత్వలేమి ఉన్నప్పటికీ 2013 నుండి బీజేపీ తన 33 శాతం ఓట్ల వాటాను నిలబెట్టుకుంటూ వస్తుంది. విశ్వాసపాత్రులైన ఓటర్లు బీజేపీ పార్టీకి చాలా ప్రయోజనకరంగా ఉంటున్నారు. అయితే గడిచిన పది సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ పతనం ఆప్ ను పతాక స్థాయికి చేర్చింది.

2013లో 24.55 శాతంగా ఉన్న కాంగ్రెస్ ఓట్ల వాటా 2015లో 9.65 శాతానికి, 2020లో 4.26 శాతానికి పడిపోయింది. కాంగ్రెస్ పార్టీకి జరిగిన నష్టమంతా ఆప్కు లాభంగా మారింది. బలమైన ప్రచారంతో యథాతథస్థితి రాజకీయాల్ని ప్రశ్నిస్తూ ఆప్ 2013 లో 29.49 శాతం ఓట్లు సాధించి, తన మొదటి ఎన్నికల్లోనే బీజేపీకి రెండో స్థానంలో నిలిచి, ఆ తరువాత బాగా బలపడి పోయింది.

2015లో 54.34 శాతం ఓట్లతో 67 స్థానాలు, 2020లో 53.57 శాతం ఓట్లతో 62 స్థానాలతో ఢిల్లీలో సగానికి పైగా ఓట్లను సాధించింది. మరోవైపు బీజేపీ 2015లో 32.19 శాతం నుండి 2020లో 38,51 శాతానికి తన ఓట్ల వాటాను పెంచుకుంది. అయితే బీజేపీ ఇప్పటికీ ఆప్ కు రెండవ స్థానంలోనే ఉంది. ఇలాంటి అంశాల కారణంగా బీజేపీ, ఆప్ ప్రభుత్వానికి వ్యతి రేకంగా ఉంది కానీ కాంగ్రెస్ విషయంలో మాత్రం వ్యూహాత్మక మౌనం వహించింది. తన పెద్ద రాజకీయ ప్రత్యర్థి పునరుద్ధరణ కోసం ఆశలు పెట్టుకునే క్లిష్ట పరిస్థితుల్లో బీజేపీ చిక్కుకుంది. కాంగ్రెస్ పార్టీ కొంత మేరకైనా తన ఓట్ల వాటాను మెరుగు పరచుకుంటే, బీజేపీకి, అప్ ను ఓడించే అవకాశం ఉంటుంది. ఒకవేళ కాంగ్రెస్ పార్టీకి మళ్ళీ గతంలో ఉన్న పరిస్థితి ఉంటే, ఢిల్లీలో బీజేపీకి అధికారం దక్కదు.


**- అజయ్ ఆశీర్వాద్ మహాప్రశస్థ**

(ది వైర్ కోసం..)


## కార్యకర్తలే పార్టీకి అధినేతలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కార్యకర్తలే పార్టీకి అధినేతలని, నాడు ఒక్కరితో ప్రారంభమైన తెలుగుదేశం పార్టీ కుటుంబం నేడు కోటి సభ్యత్వాలతో మరింత విస్తృతమైందని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్‌లో ఉన్న తెలుగుదేశం పార్టీ జిల్లా పార్టీ కార్యాలయంలో కోటి సభ్యత్వాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజల ముఖాల్లో సంతోషం నెలకొందన్నారు. ప్రజారంజక పాలన అందిస్తున్నామని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని వివరించారు. గత రికార్డులు తిరగరాస్తూ కోటి సభ్యత్వాలతో సరికొత్త రికార్డు సృష్టించిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తల ఆలోచనలకు, మనోభావాలకు గుర్తింపునిస్తూ వారికి ప్రత్యేకమైన గౌరవం అందించే పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. దేశంలో ఏ పార్టీకి లేనంతగా తెలుగుదేశం పార్టీకి కార్యకర్తల బలం ఉందని శంకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.




## స్వచ్ఛాంధ్ర సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. శనివారం నరసన్నపేట మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద స్వచ్ఛాంధ్ర పేరుతో నిర్వహించిన పారిశుద్ధ్య పనులను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అధికారులు తప్పనిసరిగా పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలతోపాటు పంచాయతీలలో కూడా పరిశుభ్రత పట్ల దృష్టి సారించి, ఆరోగ్యకరమైన గ్రామాలను ఏర్పాటు చేసేవిధంగా చూడాలన్నారు. ఈ క్రమంలో అక్కడే జరిగిన స్వచ్ఛ ఆంధ్రపనుల్లో ఆయన స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి పాల్గొన్నారు. అనంతరం విలేకరుల కాలనీ వద్ద మహిళలకు తడి చెత్త, పొడి చెత్త పట్ల అవగాహన కార్యక్రమం చేపట్టారు. ప్రధాన రహదారిలో ఉన్న స్థానిక శాఖ గ్రంథాలయం వెనుక అపారిశుధ్యం నెలకొని ఉండటంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. పల్లిపేట జంక్షన్, ఇందిరానగర్ కాలనీలో పారిశుధ్యం పట్ల స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం అండర్ డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఈ వ్యవస్థ పట్ల దృష్టి సారించి అభివృద్ధి చేయడం పట్ల ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కృషిని ఆయన అభినందించారు. అనంతరం ప్రతిజ్ఞ చేపట్టారు. ఇకపై ప్రతినెల మూడవ శనివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ అండ్ బి పంచాయతీరాజ్ తదితర శాఖ అధికారులతో పాటు డిపిఓ భారతి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతతోనే ఆరోగ్యం

(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)

పరిసరాల పరిశుభ్రతపైనే ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని ఇచ్ఛాపురం జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) పీఓ ఎస్.రజనీకుమారి పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మంచి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం మన చేతుల్లోనే ఉందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. దీని కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తద్వారా అంటువ్యాధులు ప్రబలకుండా నియంత్రించవచ్చన్నారు. అనంతరం విద్యార్థినిలు శ్రమదానం చేసి కళాశాల పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రియా సుధాకర్, కె.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.





మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక సూర్యమహల్ జంక్షన్ దగ్గర ఉన్న జిల్లా ఎన్టీఆర్ అభిమాన సంఘాల అధ్యక్షులు బరాటం ఉదయ శంకర్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ సాంస్కృతిక విభాగ అధ్యక్షులు గుత్తు చిన్నారావు, పట్టణ అధ్యక్షులు మాదారపు వెంకటేష్, పట్టణ కార్యదర్శి చిట్టి నాగభూషణరావు, పి.రమణమూర్తి, లొట్టి సూరిబాబు, కలగ గోపాల్, ఎస్వీ రమణ మాదిగ, కొమర కమల, కళావతి, విజయ, సుశీల, కటారి కమల, అసిరమ్మ, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు

- సత్యంన్యూస్, శ్రీకాకుళం

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఇ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001





ప్రతి నెల మూడవ శనివారం

# స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర

గౌరవ ముఖ్యమంత్రి
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి పిలుపును అందుకుందాం. ప్రతి నెల మూడవ శనివారాన్ని 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' దినంగా పాటిద్దాం.

పరిశుభ్రం ఆరోగ్యం
ఒక అడుగు ముందుకు స్వచ్ఛత వైపు

మంచి ఆలోచనలు, ఆరోగ్యవంతమైన శరీరం, స్వచ్ఛమైన వాతావరణం, ఇంటి దగ్గర, పనిచేసే చోట శుభ్రతలతో మన రాష్ట్రాన్ని స్వర్ణ ఆంధ్రగా, స్వచ్ఛ ఆంధ్రగా తీర్చిదిద్దుకుందాం.



## 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' లక్ష్యాలు

- ఇంటింటి నుంచి 100% చెత్త సేకరణ
- చెత్తను 100% తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేయడం
- ఘన వ్యర్థాలను 100% శాస్త్రీయంగా ప్రాసెస్ చేయడం
- తిరిగి ఉపయోగించగల వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడం
- చెత్త కుప్పలు లేని సమాజం
- 100% వాడుక నీటి నిర్వహణ
- 100% ఓడిఎఫ్ ప్లస్ ఆదర్శ గ్రామాలు



జారీ చేసినవారు : స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్

ప్రజలారా రండి! 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' లక్ష్యాల సాధనలో ప్రభుత్వానికి సహకరించండి


Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.